






హంద్రీనీవాలో కదలికొచ్చేనా..?

◆ ఎక్కడి పనులు అక్కడే ◆ ఐదేళ్లుగా కనిపించని పురోగతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాకు సాగు, తాగునీటిని అందించే కీలక ప్రాజెక్టు హంద్రీనీవా విస్తరణ పనులు ఎక్కడివక్కడే అన్న చందంగా మారాయి. ప్రధాన కాలువ వెడల్పు పనులు కూడా కదలిక లేకుండా ఉన్నాయి. కేవలం 1800 క్యూసెక్కుల వరకే నీటిని తీసుకునేందుకే పరిమితమై ఉన్నాయి. ఒకవైపు ఈ ప్రాజెక్టు ఆధారంగా అనేక ప్రాంతాలకు నీటిని అందిస్తామని హామీలిచ్చి టెండర్లు కూడా పిలిచారు. ఆ పనుల్లో కూడా కదలికలేకుండా ఉండిపోయాయి.

కమ్యూనిటీ లిఫ్టు, డ్రిప్ ఇరిగేషన్

ఉరవకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన కమ్యూనిటీ లిఫ్టు అండ్ డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి కర్నాటకలో రామతాల్ ప్రాంతంలో కమ్యూనిటి లిఫ్టు అండ్ డ్రిప్ పద్ధతిలో ప్రాజెక్టును చేపట్టారు. దేశంలోనే ఇది రెండో పెద్ద ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టును రూ.890 కోట్లతో చేపట్టారు. మెగా సంస్థకు ఈ పనులను అప్పగించారు. గడిచిన ఐదేళ్లలో టెండర్లు పున:సమీక్ష పేరుతో ముందుకు కదలకుండా ఉండిపోయింది. ప్రభుత్వ ఆదేశాల్లేక పనులు ముందుకు సాగలేదు.

భైరవానితిప్పకు తప్పని తిప్పలు

హంద్రీనీవా మొదటి దశ చివరి పాయింట్ అయిన జీడిపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. రూ.967 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 22,323 ఎకరాలకు నీటిని అందివ్వాలన్నది లక్ష్యం. భూసేకరణ పేరుతో గడిచిన ఐదేళ్లు పనులు ముందుకు సాగలేదు. చివరల్లో భూసేకరణకు నిధులు విడుదల చేసినా ఇంకా పూర్తవ లేదు. దీంతో పనులు ముందుకు సాగలేదు.

అటకెక్కిన అప్పర్ పెన్నార్

లక్ష ఎకరాలకు ఆయకట్టుకు నీరిచ్చే లక్ష్యంతో చేపటిన అప్పర్ పెన్నార్ పనులు అటకెక్కాయి. ఈ పనులను రూ.803.97 కోట్లతో చేపట్టారు. నాలుగు రిజర్వాయర్లు నిర్మిస్తామని ప్రకటన కూడా చేశారు. అయితే ఇప్పటి వరకు భూసేకరణ పూర్తవలేదు. పనులు ముందుకు సాగలేదు.

పుట్టపర్తి ఎత్తిపోతలు..

పుట్టపర్తి నియోజకవర్గంలో 195 చెరువులకు నీటిని అందించేందుకు రూ.864.8 కోట్లతో పనులు మంజూరయ్యాయి. ఈ పనులును 2022 సెప్టంబర్‌లో అప్పగించారు. ఈపనులూ నత్తనడకన నడుస్తున్నాయి. ముదిగుబ్బ మండలంలో నిర్మించిన జిల్లేడుబండ పనులు అదే తీరున నత్తనడకనే పనులు సాగుతున్నాయి.

ఈ రకంగా ఉమ్మడి జిల్లా అంతటికీ సాగు,తాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన హంద్రీనీవా విస్తరణ పనులు ఎక్కడివక్కడే అన్న చందంగా మారాయి. కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. రాబోయే కొత్త ప్రభుత్వమైనా ఈ పనుల పురోగతిపై ఏ మేరకు దృష్టి సారిస్తుందో అన్నది చూడాల్సి ఉంది.

ధరల మంట

◆ మండిపోతున్న కూరగాయల ధరలు
◆ ఆకుకూరల నుంచి అన్నింటి ధరలకూ రెక్కలు
◆ వేసవి ఎండలు, ఇటీవల వర్షాల ప్రభావం
◆ చికెన్, మటన్, కోడిగుడ్లదీ అదే పరిస్థితి
◆ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరాభారం

కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏ కూరగాయ కొనలన్నా దాని ధర చుక్కలను తాకుతోంది. గడిచిన వారం రోజులుగా వీటి ధర అమాంతం పెరిగింది. మండుతున్న ఎండల ప్రభావం... ఇటీవల కురిసిన ఆకాల వర్షాలు కూరగాయల పంటలపై పడింది. దీంతో వీటి ధరలు చుక్కలను తాకుతున్నాయి. అటు చికెన్, మటన్, చేపలు, గుడ్లు ధరలు కూడా పెరిగాయి. ఓ వైపు కూరగాయలు, మరోవైపు మాంసాహారం ధరలు పెరగడంతో పేద, మధ్య, తరగతి ప్రజలపై ధరాభారం పడుతోంది. ధరల మంటతో సామాన్యుడు విలవిల్లాడి పోతున్నాడు.

ప్రజాశక్తి-హిందూపురం

గత నెలలో కూరగాయల ధరలు సాధారణంగానే ఉన్నాయి. ఈ నెల ప్రారంభం నుంచి వాటి ధరలు పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం అన్ని కూరగాయల ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ఎండల ప్రభావంతో కూరగాయల పంటలు దెబ్బ తిన్నాయని, ఫలితంగా దిగు బడులు తగ్గి మార్కెట్‌కు కూరగాయలు రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. టోకుగా ధరలు పెరిగిపోవడం వల్ల చేసేదిలేక ధరలు పెంచి అమ్మాల్సి వస్తోందని చిన్న వ్యాపారులు అంటున్నారు. రూ.10 మించి ఉండని ఆకుకూర కట్ట ప్రస్తుతం రూ.20కి పెరిగింది. రూ.5 దొరికే కొత్తిమీర రూ.20 పెట్టినా ఒక కట్ట రాని పరిస్థితి ఉంది. టమాట కిలో రూ.40 నుంచి రూ.50కి చేరింది. వంకాయలు కిలో రూ.30 నుంచి రూ.40కి చేరాయి. బీన్స్ రూ.200, బెండకాయలు రూ.40, బీట్ రూట్ రూ.40, బీరకాయాలు రూ.40, అల్లం కిలో రూ.140 నుంచి రూ.160కి పెరిగింది. పచ్చిమిర్చి రూ.70 నుంచి ఏకంగా రూ.100కి పెరిగింది. ఆనపకాయ రూ.10 నుంచి రూ.20కి చేరింది. దొండకాయలు రూ.24 నుంచి రూ.30కి పెరిగింది. అన్నింటి కన్నా మించి చిక్కుడు కాయలు కిలో రూ.150కు పెరిగింది. క్యాబేజీ కిలో రూ.26కు చేరింది. ఇలా మార్కెట్‌లో ప్రతి కూరగాయ ధర పెరిగింది. మంచి వర్షాలు పడి పంటలు చేతికందినప్పుడే ధరలు తగ్గే అవకాశాలు ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. మొత్తం మీద మార్కెట్‌లో కూరగాయల ధరలు మే నెలలో మండే ఎండలకు తోడుగా మండిపోతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనే స్థితి లేక గగ్గోలు పెడుతున్నారు.



గడిచిన వారం రోజుల వ్యవధిలో పెరిగిన కూరగాయల ధరల వ్యత్యాసం

కూరగాయ	గతవారం	ప్రస్తుతం
టమోటా	రూ.40	రూ.50
వంకాయ	రూ.30	రూ.40
బీన్స్	రూ.100	రూ.200
బెండ	రూ.25	రూ.40
బీట్‌రూట్	రూ.25	రూ.40
బీరకాయ	రూ.20	రూ.40
పచ్చిమిర్చి	రూ.70	రూ.100
చిక్కుడు	రూ.80	రూ.150
అల్లం(కిలో)	రూ.120	రూ.140
ఆకుకూర	రూ.10	రూ.20
కొత్తిమీర	రూ.5	రూ.20
మాంసాహారం ధరలు		
చికెన్	రూ.220	రూ.300
మటన్	రూ.750	రూ.800

చికెన్ కిలో రూ.300...మటన్ రూ.750..!



కూరగాయల పరిస్థితి అలా ఉంటే మాంసాహారం ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఎప్పుడూ లేనంతగా చికెన్ ఏకంగా రూ.300కు పెరిగింది. నెల రోజుల కిందట చికెన్ కిలో రూ.220 నుంచి రూ.240 వరకు ఉండేది. ఇప్పుడు రూ.300కి చేరింది. ఎండలు, వడగాల్పుల కారణంగా కోళ్లు చనిపోవడం, కొత్త వాటి ఉత్పత్తి తగ్గడంతో చికెన్ ధరలు బాగా పెరిగినట్లు తెలుస్తోంది. దీనికి తోడు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటర్లకు నాన్‌వెజ్ ఐటమ్స్‌తో పెద్దఎత్తున విందులు ఏర్పాటు చేయడంతో చికెన్ వినియోగం భారీగా పెరిగిపోయింది. ఉన్న నిల్వలన్నీ ఖాళీ అవ్వడం, కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో డిమాండ్‌కు తగిన సప్లయ్ లేకుండా పోయింది. ఫలితంగా కోళ్ల ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. నాటుకోడి సైతం కిలో రూ.600 వరకు చేరింది. ఇలా చికెన్ ధరలు పెరిగిపోయాయి. దీంతో పాటు మటన్ సైతం రూ.750 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. దీంతో నాన్‌వెజ్ ప్రియులకు ఇబ్బందికరంగా మారింది. వాతావరణం పూర్తిగా చల్లబడి వర్షాలు పడ్డాక బ్రాయిలర్ కోళ్ల బ్యాచ్‌లు మళ్లీ పెంచుతారు. అప్పటి దాకా చికెన్ ధరలు తగ్గే అవకాశం లేదని కోళ్ల పరిశ్రమ వర్గాల సమాచారం. ఇక గుడ్ల ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రస్తుతం డజను గుడ్లు రూ.80 వరకు ఉన్నాయి. గుడ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి- సోమందేపల్లి

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు పెద్దన్న, మహిళ నాయకులు స్వర్ణలత డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం మండల పరిధిలోని పత్తికుంట పల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు తమ సమస్యలను నాయకులకు వివరించారు. ప్రస్తుతం ఉపాధి పనులు 100 రోజుల సరిపోవడం లేదని పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని కోరారు. చేసిన పనులకు పేస్లిప్‌లు ఇవ్వటం లేదని చెప్పారు. పనికి తగ్గ వేతనం రావడం లేదని వాపోయారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పథకానికి నిధులు తగ్గించి క్రమేణ ఉపాధి పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర పన్నిందని విమర్శించారు. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడంతో కూలీల కష్టం పరుల పాలవుతోందన్నారు. ఉపాధి హామీ పని దినాలు పెంచి కూలి రేట్లు పెంచి కూలీలకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కూలీలు ఐక్యంగా పోరాడి ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

కౌంటింగ్ సందర్భంగా మూడంచెల భద్రత

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కౌంటింగ్ సందర్భంలో మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామని మానవ వనరులు సిద్ధం చేశామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఎన్నికలు 2024 కౌంటింగ్ సన్నద్ధతపై న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ డీఈవోలు, సి పి లు, ఎస్పీలు తదితరులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు తీసుకున్న ఏర్పాట్లు గురించి డిప్యూటీ కమిషనర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒ కొండయ్య, కదిరి పుట్టపర్తి ధర్మవరం రిటర్నింగ్ అధికారులు వంశీకృష్ణ, భాగ్యరేఖ, వెంకట శివ సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న జరిగే కౌంటింగ్ నేపథ్యం లో ఇప్పటికే సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చామని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించామని అన్నారు. ఇప్పటికే 90 శాతం కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి అయ్యాయనివివరించారు. హిందూపురం సమీపంలో బిట్ కళాశాలలో, లేపాక్షి దగ్గర చోళ సముద్రం గురుకుల పాఠశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓట్ల లెక్కింపునకు తగిన సిబ్బందిని నియమించామని గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. కేంద్ర బలగాలతో పాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 13 మంది సిఐలు, 64 మంది ఎస్ఐలు, 97 మంది ఆర్ఎస్ఐలు, 326 మంది హెడ్ కానిస్టేబుల్లు, 128 మంది పోలీసులు, 242 మంది హోంగార్డులను నియమిస్తున్నామన్నారు. జిల్లాలో 101 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామనివాటిపై గట్టి నిఘా పెట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, తదితరులు

గ్రామాల్లో నీటి ఎద్దడి పట్టదా..?

మండలమీట్‌లో అధికారులపై ఎంపిటిసిల ఆగ్రహం

ప్రజాశక్తి-హిందూపురం

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఎంపిటిసిలు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో చుక్క నీరు దొరకడం కష్టంగా ఉన్నప్పటికి అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపిపి రత్నమ్మ అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసిలు మాట్లాడుతూ తమ గ్రామాల్లో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి కోసం బోర్లు వేయమని అధికారులను అడిగితే ఎన్నికల కోడ్ వల్ల నిధులతో కూడిన సమస్యను పరిష్కారం చేయడానికి ఇబ్బందిగా ఉందనిచెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దివ్య అవసరమైన చర్యలు తీసుకుని పరిష్కారం చేస్తామన్నారు. ఎంపిటిసి షమీం తాజ్ మాట్లాడుతు తూమకుంట గ్రామంలో కొన్ని పరిశ్రమల నిర్వాహకులు వారి పరిశ్రమల నుంచి కాలుష్యం కాలువల్లో వదలడంతో నీరు కాలుష్యం అవుతుందని అన్నారు. ఇది చాలదన్నట్లు చెరువులో పరిశ్రమల వ్యర్థాలను వేస్తున్నారని చెప్పారు. దీంతో చెరువులోకి వచ్చే నీరు కాలుష్యంగా మారుతుందన్నారు. ఇక తమ గ్రామ సమీపంలో ఉన్నా పెన్నా నది ఏరులో నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతోందనిదీనిపై ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని వెంటనే అధికారులు ఈ విషయాలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరుపై వివరించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ వెంకటేశ్వర రెడ్డి, ఎంఇఒ గంగప్ప, జడ్‌పిటిసి నాగభూషణం, ఇఒఆర్‌డి నటరాజ్, వైస్ ఎంపీపీలు రఘునాథరెడ్డి, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటేశ్వర రెడ్డి

అక్రమ అడ్మిషన్లు నిరోధించాలి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యాసంవత్సరం ప్రారంభం కాకమునుపే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్స్ నిర్వహిస్తున్నాయని, ఆలాంటి విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. అక్రమ అడ్మిషన్‌లపై బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలోని బాలుర వసతిగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు విచ్చలవిడిగా అక్రమంగా అడ్మిషన్స్ నిర్వహిస్తున్నాయన్నారు. ఇది చాలదన్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను వసూలు చేయకుండా వారికి ఇష్టం వచ్చిన విధంగా ఫీజులను పెట్టడంమే కాకుండా పుస్తకాల నుంచి విద్యార్థులు వాడే స్కూల్ యూనిఫాం,చివరకు సాక్స్‌ల వరకు తమ వద్దే తీసుకోవాలని నిబంధనలను విధించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిలువు దోపిడీ చేస్తున్నారు. వీటిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ఇలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, నిహాల్, హర్ష కుమార్, భగత్, అభి, వినోద్, నవీన్, సురేష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి ముదిగుబ్బ

పట్టణం లోని బిసి హాస్టల్ వార్డెన్ నారాయణమ్మ ఉద్యోగ విరమణ చేశారు. ఈనేపథ్యంలో ఆమెకు బుధవారం స్థానిక హాస్టల్ ప్రాంగణంలో సన్మాన సభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బిసివెల్ఫేర్ జిల్లా అధికారి నిర్మలజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వార్డెన్ నారాయణమ్మ చేసిన సేవలను కొనియాడారు. మొదట వర్కర్ గా జాయిన్ అయి వార్డెన్‌గా రిటైర్డ్ అవుతున్న నారాయణమ్మ ఇటీవల బెస్ట్ వార్డెన్ గా అవార్డ్ అందుకున్నారని అభినందించారు. నారాయణమ్మ తన 32 ఏళ్ల ఉద్యోగ సర్వీస్ లో ఏలాంటి చిన్న రిమార్క్ లేకుండా, నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. అనంతరం వార్డెన్ నారాయణమ్మ ను అధికారులు, వార్డెన్లు, సిబ్బంది తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఎబిసిడబ్ల్యూఒ రాజ కుల్లాయప్ప, తాడిపత్రి ఎబిసిడబ్ల్యూఒ రంగమ్మ, బిసి హాస్టల్ వార్డెన్ల సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు మస్తాన్, ప్రధాన కార్యదర్శి కుళ్ళయస్వామి, కోశాధికారి ఠాగూర్, వార్డెన్లు మారుతి ప్రసాద్, రాజశేఖర్ నాయుడుతో పాటు బీసీ హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో మీనాక్షి తెలిపారు. బుధవారం జిల్లాలో ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారని ఈ పరీక్ష కు 5519 మంది హాజరుకావాల్సి ఉండగా వారిలో 3584 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారఇ చెపాపరు. శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో 29 కేంద్రాలలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

రైతులకు నాణ్యమైన విత్తన కాయలు పంపిణీ చేయాలని సిపిఐ నాయకులు చల్లా శ్రీనివాసులు కోరారు. స్థానిక కస్తూరిబాయ్ కాలనీ సమీపంలో ఉన్న వ్యవసాయ గోడౌన్ లో నిలువ ఉంచిన వేరుశనకాయలను రైతులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు, గత ఏడాది నాశిరకం కాయల్ని పంపిణీ చేసిన ప్రభుత్వం ఈసారైనా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
O.S.No. 324/2020

Between:
K.Ramachandra ...Plaintiff
And
J.Baddu Naik ...Defendent

Defendent:జరపాల బడ్డు నాయక్ S/o జె.రామునాయక్, వయస్సు 49 సంవత్సరాలు, residing at పి.కోటలా గ్రామం, H/o కొండగట్టుపల్లి, ముదిగుబ్బ మండలం, శ్రీసత్యసాయి జిల్లా.

ప్రతివాదికి కోర్టు నోటీసులు

పైన తెలిపిన వాది మీపై ప్రాంసరీ నోటు డబ్బు వసూలు కోసం కోర్టులో దావా వేసి ఉన్నారు. ఈ దావాలో మిమ్మలను ప్రతివాదిగా చేర్చడమైనది. నీ హాజరు నిమిత్తం పై కోర్టులో 18/06/2024 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:18/06/2024
స్థలం:కదిరి

కె.నాగేంద్ర రెడ్డి, బి.ఎ.,బి.ఎల్.,
పిటీషనర్ తరుపు న్యాయవాది, కదిరి.

మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
I.P.No. 16/2023

Between:
పి.అనంతరెడ్డి ...Petitioner
And
వి.కిరణ్‌కుమార్ మరియు ఇతరులు ...Respondent

Respondent No:3మాటేడు సుగుణ W/o ఎన్.చంద్రశేఖర్, వయస్సు 46 సంవత్సరాలు, residing at D.No:1/135-60, అడపాల స్ట్రీట్, కదిరి టౌన్, శ్రీసత్యసాయి జిల్లా.

3వ ప్రతివాదికి కోర్టు నోటీసులు

పైన తెలిపిన వాది మీపై క్రెడిటార్ ఐ.పి Petition కోర్టులో వేసి ఉన్నారు.ఈ Petition లో మిమ్ములను 3వ ప్రతివాదిగా చేర్చడమైనది. నీ హాజరు నిమిత్తం పై కోర్టులో 18/06/2024 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. ఆ రోజు మీరు స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు వారికి తెలుపుకోవాలని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:18/06/2024
స్థలం:కదిరి

కె.నాగేంద్ర రెడ్డి, బి.ఎ.,బి.ఎల్.,
పిటీషనర్ తరుపు న్యాయవాది, కదిరి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ (జూనియర్ డివిజన్) జడ్జి గారి కోర్టు, కదిరి
O.S.No. 99/2021

Between:
జి.శ్రీనివాసులు ...వాది
And
కె.ముస్తాఫా ...ప్రతివాది

ప్రతివాది అయిన కె.ముస్తాఫా హాజరు కొరకు

కె.ముస్తాఫా S/o కె.మస్తాన్ వలి, D.No:1-152, మెయిన్ రోడ్డు, కురుమాల గ్రామము, నల్లమాడ మండలం, శ్రీసత్యసాయి జిల్లా.అయిన నీకు ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పై కోర్టులో నీపైన జి.శ్రీనివాసులు S/o జి.నారాయణప్ప, సంజీవుపల్లి, నల్లచెరువు మండలం అను వాదికి రావలసిన ప్రాంసరీ నోటు బాకీ రాబట్టుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినాడు. కావున పై దావాలో నీ హాజరు కొరకు పై కోర్టు వార్లు 20/06/2024 వ తేది వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు తేదిన నీవు స్వయంగా గానీ లేక నీ ఉత్తర్వులు పొందిన వకీలు ద్వారా గానీ హాజరై ఏవైన ఆక్షేపణలు వున్నచో నీవు తెలుపవలెను. అట్లు తెలపని పక్షంలో పై దావాను పై కోర్టు వారు నీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:20/06/2024
స్థలం:కదిరి

ఎన్.సత్యనారాయణగుప్త, బి.ఎస్సీ.,బి.ఎల్.,
వాదితరుపు వకీలు, కదిరి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ (జూనియర్ డివిజన్) జడ్జి గారి కోర్టు, కదిరి
I.A. No. 564/2021 in O.S.No. 99/2021

Between:
జి.శ్రీనివాసులు ...పిటీషనర్/వాది
And
కె.ముస్తాఫా ...రెస్పాండెంట్/ప్రతివాది

రెస్పాండెంట్/ప్రతివాది అయిన కె.ముస్తాఫా హాజరు కొరకు

కె.ముస్తాఫా S/o కె.మస్తాన్ వలి, D.No:1-152, మెయిన్ రోడ్డు, కురుమాల గ్రామము, నల్లమాడ మండలం, శ్రీసత్యసాయి జిల్లా.అయిన నీకు ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా పై కోర్టులో నీపైన జి.శ్రీనివాసులు S/o జి.నారాయణప్ప, సంజీవుపల్లి, నల్లచెరువు మండలం అను వాదికి రావలసిన ప్రాంసరీ నోటు బాకీకి గాను మీ పేరుతో కురుమాల రెవెన్యూ గ్రామములోని భూమిని ఎ.సి.2-94 సెంట్లు సర్వే నెం.508-1, అటాచ్‌మెంట్ కోరుతూ పై కోర్టులో పై అర్జీని దాఖలు చేసినాడు. కావున పై కోర్టులో మీ హాజరు కొరకు పై కోర్టు వారు 20/06/2024 వ తేది వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు తేదిన నీవు స్వయంగా గానీ లేక నీ ఉత్తర్వులు పొందిన వకీలు ద్వారా గానీ హాజరై ఏవైన ఆక్షేపణలు వున్నచో నీవు తెలుపవలెను. అట్లు తెలపని ఎడల పై కోర్టువారు పై అర్జీని నీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:20/06/2024
స్థలం:కదిరి

ఎన్.సత్యనారాయణగుప్త, బి.ఎస్సీ.,బి.ఎల్.,
వాదితరుపు వకీలు, కదిరి.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి



కొత్తచెరువులో బహుమతి అందజేత



ధర్మవరంలో భోజన నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు

మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డిఇఒ కార్యాలయ ఎడి రామకృష్ణ, ఎంఇఒలు రెడ్డప్ప, జై చంద్ర తెలిపారు. కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12వ తేదీ నుండి పాఠశాలలు ప్రారంభం అవుతున్నందున ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం వీరందరికీ వంటల పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, వెంకటేశు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యతతో పాటు పరిమాణాన్ని పాటించాలని ఎంఇఒలు రాజేశ్వరి, గోపాలానాయక్ కోరారు. స్థానిక సుందరయ్య నగర్‌లోని గణేశ్ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు నాణ్యతాప్రమాణాలపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భోజనతయారీలో తీసుకుకోవాల్సిన నాణ్యత, పరిశుభ్రతల గురించి వివరించారు. పాఠశాలల్లో వందశాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినాల్సిందేనని అందుకు ఏజెన్సీలు నాణ్యమైన భోజనాన్ని తయారుచేయాలని చెప్పారు. అనంతరం భోజనాల తయారీపై వారికి పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

పుట్టపర్తి అర్బన్ : పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల పాత్ర కీలకమని ఎంఇఒ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో ఏజెన్సీ నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ప్రాథమిక,ఉన్నత పాఠశాలలకు చెందిన 47 పాఠశాలలకు గాను 40 పాఠశాలల ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు. ఎంఇఒతో పాటు ఏడీ రామకృష్ణ తదితరులు ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం వంటలు వండాలని పరిశుభ్రత పాటించాలన్నారు. మెనూ లో ఉన్న ప్రకారమే పోషిక విలువలు ఉండే విధంగా వండి, విద్యార్థులకు వండించాలన్నారు. త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్నాయని ఏజెన్సీలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం వంటలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎంటిలు వనిత, ప్రశాంతి, ఎంఆర్‌సి సిబ్బంది నాగరాజు, రామ్మోహన్, శ్రీనివాసులు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కవిత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత రిటైర్డ్ ఉపాధ్యాయులు బి. వెంకటరత్నం, గ్లోబల్ పాఠశాల అధినేత డాక్టర్ శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

బత్తలపల్లి ధర్మవరం రహదారిలో మధ్యలోనిదుకాణం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం మేరకు బత్తలపల్లిలోని గుడిసెల్లో నివాసముంటున్న ఓ బాలుడు టీవీఎస్ ఎక్స్ఎల్‌లో వెలుతున్నాడు. ఇదే సమయంలో బత్తలపల్లి నుంచి తహశీల్దార్ కార్యాలయానికి ద్విచక్రవాహనంలో కోటి నాగరాజు అనే వ్యక్తి వెళుతున్నాడు. అదేవిదంగా బత్తలపల్లి నుంచి పోట్లమర్రికి ద్విచక్రవాహనంలో సాయినాథరెడ్డి వెలుతున్నాడు. ముందు వెలుతున్న బాలుడు ఉన్నఫలంగా కుడివైపునకు రోడ్డు క్రాస్ అయ్యాడు. దీంతో వెనుక వెలుతున్న కోటి నాగరాజు తన వాహనాన్ని ఉన్నఫలంగా స్లో చేశాడు. దీంతో ఆ వెనుకే వస్తున్న సాయినాథరెడ్డి కోటి నాగరాజు వాహనాన్ని ఢీ కొన్నాడు. అనంతరం డివైడర్ మీద ద్విచక్రవాహనం పడిపోయింది. ఈ ప్రమాదంలో కోటినాగరాజు, సాయినాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండలంలోన మలకవేమల క్రాస్ సమీపాన మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్నం ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ప్రతాప్ రెడ్డి అనే వ్యక్తి ముదిగుబ్బ, నల్లమాడ, కదిరి వైన్ షాపులలో మద్యం తీసుకొని వచ్చి గ్రామంలో అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా నిందితుడి నుంచి 88 ఆంధ్ర మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ప్రతాప్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎపిటిఎఫ్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ లో సత్య సాయి జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. రాష్ట్ర కౌన్సిల్ సమావేశం కృష్ణాజిల్లా గుడివాడలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీలో జిల్లా నుంచి నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతున్న ఏ. విశ్వనాధ రెడ్డిని రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ నుంచి ఫోన్ లో మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మరింత బాధ్యతాయుతంగా కృషి చేస్తామన్నారు. ఆయన ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్ రెడ్డి, కాలవ సురేంద్ర, పూర్వపు ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వికలాంగుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

వికలాంగుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌టిసి కాలనీలో పలు ప్రాంతాలలో ఆర్‌పిలు వికలాంగుల పిల్లల కోసం బడిబాట కార్యక్రమం ద్వారా ప్రత్యేక సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఇంటికి పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా అభివృద్ధిని తీసుకురావాలని ఉద్దేశంతో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి ఒక్క వికలాంగ చిన్నారిని ఎన్‌రోల్‌మెంట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 1వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఆనంద్ బాబు, ఐఆర్‌పి లలిత, సిఆర్ఎంటి ఫైరోజా, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంజెబి గురుకుల పాఠశాలకు రంగాపురం విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - రొద్దం



విద్యార్థి నందీష్

మండలంలోని వైటి రెడ్డిపల్లి పాఠశాలలో చదువుతున్న రంగాపురం విద్యార్థి ఆర్ఎస్. నందీష్ అనే విద్యార్థి మడకశిర నియోజకవర్గంలోని గుండుమల లో గల మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలకు ఎంపిక అయినట్లు పాఠశాల ఉపాధ్యాయులు మారుతి తెలిపారు. ఏప్రిల్ 27 న జరిగిన మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష రాసిన నందీష్ 50 మార్కులకు గాను 41 మార్కులు సాధించి 5 తరగతి ప్రవేశానికి అర్హత సాధించాడు. మండలంలో మారుమూల గ్రామం రంగాపురానికి చెందిన విద్యార్థి నందీష్ ప్రవేశపరీక్షలో ప్రతిభ కనపర్చినందుకు పాఠశాల ఉపాధ్యాయుడు మారుతితో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం



పుట్టపర్తిలో పోలీసుల తనిఖీలు



పెనుకొండలో పోలీసుల మాక్‌డ్రిల్

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

కౌంటింగ్ అనంతరం కూడా గ్రామాలలో ప్రజలు ఎటువంటి అల్లర్లు గొడవలు జోలికి వెళ్లకుండా శాంతియుతంగా ఉండాలని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి సూచించారు. పోలీసులు జిల్లావ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. సమసాత్మకమైన ప్రాంతాలలో పోలీసులు విస్తతంగా తనిఖీలు నిర్వహించారన్నారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో, తర్వాత కూడా జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో పాటు, శాంతి కమిటీల వారితో పోలీసులు సమావేశం నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ అనంతరం కూడా ఎలాంటి అల్లర్లు,గొడవలు జరగకుండా అందరూ సహకరించాలని సూచించారు.

పుట్టపర్తి క్రైమ్ : ఓట్ల లెక్కింపు తరువాత ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని పట్టణ సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని చిత్రావతి రహదారి గుట్ట, కల్పవృక్షం తదితర ప్రాంతాల్లో సిఐ ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. అనుమానం ఉన్న ప్రతి ఇంటిని సోదా చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అణచివేసి అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామన్నారు. ఘర్షణలు, అలజడులు సృష్టించే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించామని అవసరమైతే వారిని నగర బహిష్కరణ చేస్తామని, పీడీ యాక్ట్ ను ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి :గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బత్తలపల్లి ఎస్ఐ పి. శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం తెల్లవారుజామున మండలంలోని తంబాపురం గ్రామంలో సిబ్బందితో కలసి కార్డన్ సెర్చ్‌తో పాటు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాలలో ఎటువంటి అంవాచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అనుమానితులు, మద్యం విక్రేతల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్స్కు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యేవరకు గ్రామాలలో అల్లర్లు, గొడవలకు చోటు లేకుండా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ :సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నా సమయంలో అల్లరి మూకలను చదరగొట్టడవే మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని పెనుకొండ డిఎస్‌పి బాబీ జాన్ సైదా తెలిపారు. బుధవారం సాయంత్రం పెనుకొండ పట్టణంలోని దర్గా సర్కిల్ లో పెనుకొండ సబ్ డివిజన్లోని సివిల్, ఏఆర్ పోలీసులు, మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ , జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రించాలన్నదే "మాబ్ ఆపరేషన్" మాక్ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశమని వివరించారు. పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేయుటకు మొదటగా హెచ్చరికలు వినకపోతే పై అధికారుల అనుమతితో భాష్ప వాయువు ప్రయోగించుట, లాఠీ చార్జ్ చేపట్టుట, వంటివి డెమో ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా అల్లర్లు గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ లోని నలుగురు సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ పంపిణీకి చర్యలు

విత్తన పంపిణీ ప్రారంభంలో కలెక్టర్ అరుణ్‌బాబు



విత్తన పంపిణీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, తదితరులు



ముదిగుబ్బలో విత్తన పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అర్హులైన రైతులందరికీ నాణ్యమైన విత్తన వేరుశనగ అందించడమే తమలక్ష్యమని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని వ్యవసాయ ఏడీ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ గోదాము వద్ద వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 5.10 లక్షల ఎకరాలలో రైతులు వేరుశెనగ పంట సాగు చేస్తున్నారన్న అంచనా ఉందన్నారు. 0.5 ఎకరాలు ఉన్న రైతుకు 30 కేజీల బ్యాగ్ ఒకటి, 0.5- 1.0 ఎకరాలు ఉన్న రైతుకి 30 కేజీల బ్యాగులు రెండు, 1.01 ఎకరా పైనున్న వారికి 30 కేజీల వేరుశనగ విత్తనాల బ్యాగులు 3 పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న ప్రతి రైతుకు విత్తన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో అత్యధిక మంది రైతులు వేరుశనగ పంటపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయని ఈ సమయంలో రైతులు నాణ్యమైన వేరుశనగ విత్తనాలు వాడి మంచి రాబడి సాధించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 90వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ అవసరమని ప్రతిపాదనలు పంపడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఆయా రైతు భరోసా కేంద్రాలలో 35 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచామని బుధవారం నుండి జిల్లాస్థాయిలోరాయితీపై వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా రైతు భరోసా కేంద్రాలలోకే-6, టీసీజీయస్-1694, కే- లేపాక్షి(కే-1812) విత్తన వేరుశనగ రకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఏనుములపల్లి కు చెందిన నాగమణి, చిన్న వీరప్ప, గంగన్న, వేమారెడ్డి అనే రైతులకు వేరుశనగ, కంది, ఉలవ, రాగి విత్తనాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడ్ కార్పొరేషన్ ఎమ్‌డి శివ ప్రసాద్, ఆర్డీవో భాగ్యరేఖ, జలంధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, వ్యవసాయ శాఖ అధికారులు వెంకట బ్రహ్మం, ఎఇఒ ఆనంద్ నాయక్‌తో పాటు సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : స్థానిక రైతు భరోసా కేంద్రంలో 770 మంది రైతులకు 670 క్వింటాళ్ల విత్తన వేరుశనగను బుధవారం పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ తెలిపారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, ఎఇఒ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల కేంద్రంలో విత్తన వేరుశనగ పంపిణీని తహశీల్దార్ నరేంద్ర బాబు, ఎఒ లోకేశ్వర్ రెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఎఒ లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మండలానికి 3వేల క్వింటాళ్ల వేరుశనగ, 50 క్వింటాళ్ల కందులు మంజూరు అయ్యాయని తెలిపారు. అన్ని ఆర్‌బికెలలో 2263 క్వింటాళ్ల వేరుశనగకు 2026 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెప్పారు. వారందరికీ కూడా బుధవారం నుంచి విత్తన పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శిరీష, ఆర్‌బికె సిబ్బంది యుగంధర్, ధనలక్ష్మి, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండలంలోని బాలే పల్లి తండాలో రైతులకు విత్తన వేరుశనగను బుధవారం పంపిణీ చేశారు. వైసిపి నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, బత్తల వెంకటరమణ చేతుల మీదుగా పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : రైతు భరోసా కేంద్రాలలో విత్తన వేరుశెనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు బుధవారం పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఎవరైనా రైతులు ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని చెప్పారు. ఇప్పటివరకు 670 మంది రైతులకు 520 కింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేశామన్నారు. వేరుశెనగ తో పాటు కందులు రాగులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు.

ధర్మవరం టౌన్ : అర్హత ఉన్న ప్రతి రైతుకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ ఏడీఏ కృష్ణయ్య తెలిపారు. పోతుకుంట రైతు భరోసా కేంద్రంలో నిర్వహిస్తున్న వేరుశనగ విత్తన పంపిణీని ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అనుకూలంగా ఉండే విధంగా రైతు భరోసా కేంద్రాలలో వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం జరుగుతోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంతవరకు ధర్మవరం మండలంలో 2513 మంది రైతులు 2,223 క్వింటాళ్ల వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారనితెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ముస్తఫా, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండలంలోని ఎనిమిది ఆర్బీకే కేంద్రాలలో బుధవారం వేరుశనగ విత్తన కాయలను రైతులకు పంపిణీ చేసినట్లు ఏవో నటరాజు తెలిపారు ఆర్‌బికెలలో పేర్లను నమోదు చేసుకున్న రైతులకు 700 క్వింటాళ్ల వేరుశగను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఖరీఫ్ సీజన్లో వేరుశనగ సాగు చేసే రైతాంగానికి ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశనగను ఆయా ఆర్బికే కేంద్రాలలో పంపిణీ చేస్తోందని మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి తెలిపారు.. బుధవారం మండల కేంద్రములోని1,2,3 ఆర్బికే కేంద్రాలలో తప్ప మిగతా ఎనిమిది ఆర్బీకే కేంద్రాలలో సచివాలయ సిబ్బంది రైతాంగానికి కే6 రకం విత్తన వేరుశనగ పంపిణీ చేశారన్నారు. బుధవారం ఎనిమిది ఆర్బికేల పరిధిలో 697 మంది రైతులకు 627 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. రైతులందరికీ సరిపడా విత్తనాన్ని అందిస్తామని వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.మండల పరిధిలోని అన్ని ఆర్బికె లలో బుధవారం నుండి విత్తన పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో ఏవో ఓబిరెడ్డితో పాటు ఆర్‌బికెల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : మండలంలోని సున్నంపల్లి ఆర్బికే కేంద్రంలో బుధవారం ప్రభుత్వం సబ్సిడీ వేరుశెనగ కాయల పంపిణీ కార్యక్రమాన్ని కదిరి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్ సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన వేరుశనగ కాయల నాణ్యతను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశెనకాయలను సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు. వ్యాపారస్తులు రైతులకు ప్రలోభాలకు పాల్పడితే చర్యలు తప్పవనిహెచ్చరించారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 4354 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా తొలి రోజు 1570 క్వింటాళ్లవేరుశెనగకాయలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులతో పాటు మండల వ్యవసాయశాఖ అధికారి ఇలియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



బత్తలపల్లిలో విత్తన పంపిణీ

గాండ్లపెంట : అర్హులైన రైతులకు సబ్సిడీ విత్తన వేరుశగన కాయలను పంపిణీ చేపట్టారు. ఉఎంపీడీవో కే రామ నాయక్, ఏవో బి లక్ష్మీ ప్రియా చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఏడు ఆర్బికె కేంద్రాలలో రైతులు రిజిస్టర్ చేసుకున్న వారికి విత్తనం కాయలు అందజేశామని వారు తెలిపారు దాదాపు రైతులు ఎనిమిది వందల నలభై మంది 750 బ్యాగులు రైతులు అందజేశామని ఇంకా మిగిలిన రైతులు కూడా పంపిణీ చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద విత్తన వేరుశగను బుధవారం పంపిణీ చేశారు. విత్తన కాయల కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారిని శ్రీ లత తెలిపారు. వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ముదిగుబ్బ : ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సిఐ యతీంద్ర కోరారు. ఈ సందర్భంగా బుధవారం మండల స్థానిక వ్యవసాయ గోదాములో వ్యవసాయాధికారి లక్ష్మి నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీ తో అందిస్తున్న విత్తన వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల దష్ట్యా 144 సెక్షన్ అమల్లో ఉందని, రైతులు ఎగబడకుండా ఒక్కొక్కరు విత్తన కాయలు పొందాలని కోరారు. ఆయన చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేసారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది షరీఫ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల పరిధిలోని ఆర్ బి కేల నందు బుధవారం సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు స్థానిక ఎంపీడీవో మహబూబ్ ఖాన్, ఎస్ఐ దిలీప్ కుమార్, అగ్రికల్చర్ ఏవో షాదబ్, అగ్రికల్చర్ సిబ్బంది చేతుల మీదుగా రైతులకు బుధవారం పంపిణీ చేశారు.